క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదా దేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషే క సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకు వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీ



రేవిడి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న ఎస్‌వో జ్ఞానవేణి

పద్మనాభం: మండలంలోని పలు ప్రాంతాల్లో మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా రేవిడి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆమె, రోగులకు పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించారు. సిబ్బంది సమయానికి వస్తున్నారో లేదో ఆరా తీశారు. అనంతరం పద్మనాభం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారో లేదో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పద్మనాభం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, మెను అమలుపై ఆరా తీశారు.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు

మధురవాడ: ఆదాని విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడం అంటే ప్రజలను నమ్మించి మోసం చేయడమేనని సీపీఎం నాయకుడు డి.అప్పలరాజు అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పరదేశిపాలెంలో ఇంటింటా కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. అప్పల రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను బద్దలు కొడతామని చెప్పిన లోకేష్ ఇప్పుడు ఎలా వాటిని బిగింపజేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండమ్మ, గురుమూర్తి రెడ్డి, బి.భారతి, సుజాత పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం



మాట్లాడుతున్న ఆనంద్‌రెడ్డి

పీఎం పాలెం: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య అత్యంత కీలకమైనదని ప్రముఖ ఐటీ రంగ నిపుణుడు బి.ఆనంద్ రెడ్డి అన్నారు. స్థానిక దుర్గా కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జరిగిన అరిహంత్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్య భవిష్యత్ మనుగడను నిర్దేశిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ శిరీష, ప్రిన్సిపాల్ ఎం.సూర్యారావు ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలు జోష్ నింపాయి. కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, బి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తితో దీపాలంకరణ సేవ



దీపాలతో శివలింగాకృతి

కొమ్మాది: కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెం వినాయక నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం దీపాలంకరణ సేవను నిర్వహించారు. శివలింగాకారంలో 516 దీపాలను వెలిగించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి



మాట్లాడుతున్న ఏడీ విజయ్‌ప్రసాద్

పద్మనాభం: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని భీమిలి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన జీఏపీ పొలం బడిలో ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు ప్రభుత్వం మంచి ధర కల్పిస్తుందన్నారు. పొలంబడిలో భాగంగా ఎంపిక చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ప్రతి గురువారం పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇస్తామని చెప్పారు. ఏవో ఎంవీఎస్ చలం, వీఏ దిలీప్ పాల్గొన్నారు.

కొండవాలు.. గుండెల్లో గుబులు

- బిక్కుబిక్కుమంటున్న నివాసితులు
- చినుకు పడితే కునుకు కరువు
- రక్షణ కల్పించాలని వేడుకోలు



ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న సత్యనారాయణ కొండ మెట్ల మార్గం



సత్యనారాయణ కొండవాలు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ఇళ్లు

తగరపువలస: వర్షాలు కురిసిన ప్రతిసారి జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డుల్లోని కొండవాలు, మెట్ట ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ నెల 18న వర్షాలకు సత్యనారాయణ కొండపై మెట్ల మార్గంలో, 26న బంగ్లామెట్ట వద్ద సర్వీస్‌రోడ్డుపై బండరాళ్లు, గ్రావెల్ జారి పడిన సంఘటనలే దీనికి ఉదాహరణ. గతంలోనూ వర్షాలకు వెంకటేశ్వరమెట్ట, కొండపేట, సత్యనారాయణపేటలో పలుమార్లు కొండ గ్రావెల్, రాళ్లు జారిపడిన సందర్భాలు ఉన్నాయి. కొండవాలు ప్రాంతాల్లో సామర్థ్యానికి మించి బహుళ అంతస్తుల భవనాలు కూడా నిర్మించడం తరచూ ప్రమాదాలకు కారణమవుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో రక్షణ గోడల నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవసరమైన చోట్ల నిర్మించిన నాణ్యమైన రక్షణగోడలు తప్ప మిగిలిన ప్రభుత్వాలు ఈ కొండవాలు ప్రాంత ప్రజలను పట్టించుకున్న సందర్భాలు లేవు. ఈ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకోవడమే కష్టతరమైన సందర్భాలలో జీవీఎంసీ వసతులు కల్పించకపోవడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. డ్రైనేజీలు, రహదారులు, మెట్ల మార్గాలు, తాగునీరు, వీధిదీపాలు మెట్టవాలు ప్రాంతాల్లో మచ్చుకైనా కనిపించవు. దీంతో పాటు నిత్యం విష పురుగులతో సహవాసం చేయవలసి వస్తోంది. కనీసం డ్రైనేజీలు, రహదారులు, మెట్ల మార్గాలు నిర్మించినా గ్రావెల్, బండరాళ్లు వర్షాలకు జారి పడకుండా కొంత రక్షణగా ఉంటుంది.

కొండల్ని చీల్చి జాతీయరహదారి నిర్మాణం

1974కు ముందు ఉత్తరాంధ్ర మీదుగా రాకపోకలు సాగించే వాహనాలన్నీ అంబేడ్కర్ కూడలి మీదుగా ప్రయాణించి బంగ్లామెట్ట వద్ద పురాతన వంతెన మీదుగా వెళ్లేవి. 50 ఏళ్ల క్రితం వెంకటేశ్వరమెట్ట వద్ద కొండను మధ్య నుంచి చీల్చి జాతీయరహదారి నిర్మాణం చేపట్టారు. అప్పటికే వెంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్టలకు చరిత్ర ఉండేది. 30 ఏళ్ల క్రితం నుంచి ఈ రెండు మెట్టలు ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలిశాయి. వీటితో పాటు కొండపేట, సత్యనారాయణమెట్ట, నమ్మివానిపేట కొండవాలు ప్రాంతాలలో వందల సంఖ్యలో నివాసాలు వెలిశాయి. అప్పటి వరకు పచ్చదనంతో అలరారే ఈ ప్రాంతాలలో వర్షాలకు మెట్టలు, కొండలపై ప్రమాదాలు జరుగుతుండటంతో రక్షణగోడల అవసరాలు వచ్చాయి. ఆక్రమణలు భారీ భవనాల రూపం దాల్చడంతో అప్పటికే ఈ కొండలపై ఉన్న దశాబ్దాల నాటి ఆలయాలు, కృత్రిమ రిజర్వాయర్ల ఉనికికి ముప్పు పొంచి ఉంది. మిగిలిన రోజుల్లో ఎలా ఉన్నా వర్షా కాలంలో మాత్రం ఈ మెట్ట ప్రాంతాలపై ఉన్న ప్రజలకు కంటిమీద కునుకు కరువు అవుతుంది. ఎప్పుడు ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకు వస్తుందోనని బెంగగా ఉంటారు. వర్షం నీరు గ్రావెల్, రాళ్లలోకి ఇంకి ఇంటి నిర్మాణాలను కింద నుంచి సెంటీమీటర్ల వంతున కదిలిస్తుండటంతోనే ఎక్కువగా ఈ సీజన్‌లో ప్రమాదాలు జరిగి రాళ్లు, గ్రావెల్, ఇళ్లు కదులుతుంటాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగిలిన సమయాలలో ఇక్కడ ప్రజలు ఉన్నట్టు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియకపోవడం గమనార్హం.



బంగ్లామెట్టపై ఇల్లు చివరి వరకు గ్రావెల్ జారి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం



వెంకటేశ్వరమెట్ట వద్ద సర్వీస్‌రోడ్డు వైపు ప్రమాదకరంగా బండరాళ్లు



బంగ్లామెట్ట వద్ద సర్వీస్‌రోడ్డు వైపు ప్రమాదకరంగా కొండవాలు ప్రాంతం

రక్షణ చర్యలు చేపట్టాలి



పేదలు ఎక్కువగా కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారు. అయినా వీరికి జీవీఎంసీ కనీస వసతులు కల్పించడం లేదు. ముఖ్యంగా అవసరమైన చోట్ల రక్షణ గోడలు నిర్మించడం లేదు. ప్రమాదాలు జరిగిన తరువాత వచ్చి విచారించినా ప్రయోజనం ఉండదు.

– తమ్మిన కూర్మారావు, బంగ్లామెట్ట

రోడ్ల పక్కన జాగ్రత్తలు తీసుకోవాలి



రహదారులను ఆనుకుని ఉన్న చోట మెట్టవాలు నుంచి రాళ్లు, గ్రావెల్ తరచూ వర్షాలకు జారి పడుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ముందే ఇలాంటి ప్రాంతాలను గుర్తించి హెచ్చరికల బోర్డులు పెట్టడం, వాహనాలను నెమ్మదిగా పంపించడం చేయాలి.

– తమ్మిన శ్రీను, సత్యనారాయణపేట

అవగాహన కల్పించాలి



కొండవాలు ప్రాంతాలలో నివాసం ఉంటున్నవారికి అక్కడి వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో వారిని అక్కడ నుంచి తరలించి, సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం ఏర్పాటు చేయాలి. మిగిలిన సమయంలో కూడా నిత్యావసరాలు కొండపై చేర్చుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించాలి.

– ఎ.నాగేశ్వరరావు, చిట్టివలస

పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పర్యటన



తాళ్లవలస గ్రామ సచివాలయం నుంచి బయటకు వస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

తగరపువలస: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ శుక్రవారం భీమిలిలో పర్యటించారు. స్వర్ణ పంచాయతీ స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండల పరిషత్ కార్యాలయాన్ని తొలుత సందర్శించారు. కొత్తగా నిర్మిస్తున్న డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలించిన అనంతర తాళ్లవలస గ్రామ పంచాయతీ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆస్తిపన్ను, డిజిటలైజేషన్ విధానాలను పంచాయతీ కార్యదర్శి వి.వి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. గ్రామకంఠ విధానం గురించి ఆరా తీశారు. న్యాయస్థానం పరిధిలో ఉన్న చెత్త సేకరణ కేంద్రం, డంపింగ్‌యార్డుకు అవసరమైన స్థలంపై కలెక్టర్ హరేందిరప్రసాద్‌తో మాట్లాడుతామన్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీపీవో ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరులకు నివాళులు

తగరపువలస: 25 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత ప్రభుత్వ విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన అమరవీరులు బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణలకు శుక్రవారం భీమిలి ఏరియా సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. గుజ్జు రామునాయుడు భవన్ ముందు జరిగిన కార్యక్రమంలో ఆనాడు బషీర్‌బాగ్‌లో జరిగిన చీకటి రోజులను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై ప్రతిజ్ఞ చేస్తూ అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, చిల్ల నరసింహులు, కొండపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆరువేల మందికి అన్నదానం

పద్మనాభం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శిర్లపాలెం చెరకు కాటా వద్ద శుక్రవారం ఆరు వేల మందికి అన్నదానం చేశారు. ఈ అన్నదానాన్ని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ప్రారంభించారు. కంటుబోతు నారాయణరావు పాల్గొన్నారు.

చిన్నశ్రీను ప్రీమియర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



వివిధ జట్ల క్రీడాకారులతో సిరి సహస్ర



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సిరి సహస్ర

భీమునిపట్నం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయన కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. భీమిలి ఫుట్‌బాల్ మైదానంలో ఈ పోటీలను సిరి సహస్ర (సిరమ్మ) శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో యువతకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే జట్టుకు రూ. 50వేలు, ద్వితీయ జట్టుకు రూ. 30వేలు, తృతీయ జట్టుకు రూ. 15 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలియజేశారు. క్రీడాకారులంతా గెలుపు, ఓటము లను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, మజ్జి వెంకటరావు, ఆనందపురం జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, నాలుగో వార్డు కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, ముఖ్య నాయకులు బంక సత్యం, కోరాడ లక్ష్మణరావు, అల్లిపిల్లి నర్సింగరావు, జీరు వెంకటరెడ్డి, సిల్ల కరుణాకరరెడ్డి, గాడు శ్రీను, అక్కరమాని రామునాయుడు, అక్కరమాని వెంకటరావు, బింగి హరికిరణ్‌రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, కదిరి ఎల్లాజీ, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

అనంతుని జయంతి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు, ఈవో నానాజీ బాబు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వచ్చే నెల ఆరో తేదీన జరగనున్న అనంత పద్మనాభ స్వామి జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో శుక్రవారం అనంతుని జయంతి వేడుకలపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెట్లు కిరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగించాలని, మెట్లకు సున్నం వేయాలని సూచించారు. ఈవో నానాజీ బాబు మాట్లాడుతూ దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయ బేడాలో అనంతుని వ్రతాలు రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామంజనేయ స్వామి ఆచారి మాట్లాడుతూ ఆ రోజు కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేత అనంతుని చిన్న ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఉన్న అనంతుని పుష్కరిణి వరకు ఊరేగింపుగా తీసుకువెళతామన్నారు ఎంపీపీ, ఈవో, భక్త బృందం అనంతుని జయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు.

ఇళ్ల తొలగింపులో వివాదం



పైలపేటలో వివాదం జరుగుతున్న చోటుకు చేరుకున్న భీమిలి పోలీసులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పైలపేటలో వందల ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న తాటాకు ఇళ్ల తొలగింపు శుక్రవారం దాయాదుల మధ్య వివాదానికి దారి తీసింది. సర్వే నంబర్ 60/13లో గ్రామకంఠానికి చెందిన 21 సెంట్ల స్థలంలో పూర్వం నుంచి పైల రామకృష్ణ, పైల అప్పన్న, పైల సూరిబాబు, పైల సూర్యనారాయణ, పైల రాములప్పడు కుటుంబాలతో నివసిస్తున్నారు. వీరికి ఎలాంటి సమచారం ఇవ్వకుండా పైల సూరి ఎర్రయ్య వారసులు శుక్రవారం మనుష్యులతో వచ్చి తాటాకులు తొలగించి, ఐదు ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు తీవ్రప్రయత్నం చేశారు. అందులో ఒకరు అంగీకరించగా, మిగిలిన వారు తాటాకు ఇళ్లను ఖాళీ చేయడానికి అంగీకరించలేదు. గ్రామకంఠానికి చెందిన భూమిలో పూర్వం నుంచి ఉన్నామని, ఇవి తమ సొంతమని భీష్మించుకుని కూర్చున్నారు. న్యాయస్థానంలో వివాదంలో ఉండగా తమపై దౌర్జన్యం చేస్తే సహించబోమని తిరగబడటంతో ఇరువర్గాల మధ్య వివాదం తీవ్ర రూపం దాల్చింది. బాధితులు భీమిలి పోలీసులకు సమాచారం అందించడంతో వారు చేరుకుని ఇరువర్గాలను భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై పైల సూరి ఎర్రయ్య కుమారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నాన్నమ్మ రాములమ్మ 2010లో భూమి కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేశారని, 2016 నుంచి వివాదంలో ఉందని, ఇటీవల న్యాయస్థానం తమకు డిక్రీ ఇచ్చిందని తెలిపారు. అందుకే స్వాధీనం చేసుకోవడానికి వచ్చామన్నారు. భీమిలి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు చెక్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో ప్రభుత్వ భూమి ఆక్రమణను ప్లానింగ్ సెక్రటరీలు, గ్రేడ్–2 వీఆర్‌వోలు శుక్రవారం అడ్డుకున్నారు. కొమ్మాది రెవెన్యూ గ్రామం రామాలయ సమీపంలో ఓ వ్యక్తి కొద్దికాలంగా సుమారు 200గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నం చేస్తున్నాడు. తాజాగా ఇక్కడ సిమెంట్ పోల్స్‌తో ఫెన్సింగ్ వేసే ప్రయత్నం చేస్తున్నాడు. స్థానికులు ఫిర్యాదు ఇవ్వడంతో ప్రభుత్వ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. ఈ భూమిపై ఏమైనా హక్కులు ఉంటే ఉన్నతాధికారులకు చూపించాలని స్పష్టం చేశారు.

తెలుగు భాషపై టీడీపీ నిర్లక్ష్యం

- తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొనకుండా వెనుదిరిగిన మంత్రి లోకేష్



విద్యాశాఖ మంత్రి కోసం ముస్తాబు చేసిన తెలుగు కవుల చిత్రాలతో కూడిన గది



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి రావు

మధురవాడ : తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరు కాకపోవడం ఉపాధ్యాయులు, విద్యార్థులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తెలుగు భాషా పరిరక్షణకు తామే కట్టుబడి ఉన్నామని చెప్పుకునే టీడీపీ నాయకులు, తెలుగు భాషా దినోత్సవాన్ని పట్టించుకోలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి లోకేష్ పర్యటనకు అనుగుణంగా పాఠశాల తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాలు గిడుగు రామ్మూర్తి పంతులు, ఇతర తెలుగు కవుల చిత్రాలతో ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ఎమ్మెల్సీ ద్వారా మంత్రికి సమాచారం కూడా పంపించారు. కానీ పక్క గదిలోనే ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్..ఈ కార్యక్రమాల్లో పాల్గొలేదు. దీంతో చేసేదేమీ లేక ఎమ్మెల్సీ చిరంజీవిరావు ఆ రెండు కార్యక్రమాలను ప్రారంభించి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూదికొండ వద్ద రైతుల ఆందోళన

పద్మనాభం: సూదికొండ వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించిన భూమిలో సాగులో ఉన్న రైతులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తెలిపారు. సూదికొండ వద్ద తమ సాగులో ఉన్న భూములను ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించడాన్ని నిరసిస్తూ రైతులు శుక్ర వారం ధర్నా చేశారు.ఆయన మాట్లాడుతూ 18 రోజులుగా రైతు లు ఆందోళన చేస్తు న్నా, వారి డిమాండ్లను పరిష్కరించక పోవడం దారుణమన్నారు. సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు



తాళ్లవలస జెడ్పీ హైస్కూల్లో తెలుగు కవులు, సరస్వతి వేషధారణల్లో విద్యార్థులు

తగరపువలస: తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను భీమిలి అర్బన్, రూరల్ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌లకు నివాళులు అర్పించారు. భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీహైస్కూల్, తాటితూరు జెడ్పీ హైస్కూల్, చిట్టివలస జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో తెలుగు భాష ఆవశ్యకత, క్రీడల ప్రాధాన్యం గురించి ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. తాళ్లవలస జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు తెలుగు కవులు, సరస్వతీదేవి వేషధారణలతో అలరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఖోఖో, త్రోబాల్, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్స్ చప్పా సురేష్, శ్రీనివాస్, ఏవో కేశవమూర్తి బహుమతులు అందించారు. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్‌ఎస్‌ఆర్ఐటీలో ఈ నెల 21 నుంచి 28 వరకు విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాస్కెట్‌బాల్, టెన్నీకాయిట్ తదితర పోటీలు నిర్వహించగా 83 జట్లకు సంబంధించి 996 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకలలో కళాశాల కార్యదర్శి ఎన్. ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఏవో పి.ఎస్.ఎన్.రాజు తదితరులు విద్యార్థులకు బహుమతులు అందించారు.

- **భీమునిపట్నం:** భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) వద్ద శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో ధ్యాన్‌చంద్‌కు ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు నివాళులర్పించారు.



తాటితూరు హైస్కూల్లో గిడుగు, ధ్యాన్‌చంద్‌లకు ఉపాధ్యాయుల నివాళులు



బహుమతులతో శొంఠ్యాం ఎస్‌ఎస్‌ఆర్ఐటీ విద్యార్థులు